కథ

# తొలగిన మబ్బు

డాక్టర్ రాగతి రమ


"మన హెడ్మాస్టరు గారు ఒక దేవుడు మాస్టారు. ఆయన తన సొంత ఇల్లులా ఈ స్కూలుని తీర్చి దిద్దారు. పాతిక సంవత్సరాల నుంచి ఆయన జీవితం ఈ పాఠశాలకే అంకితమై పోయింది. ఇక్కడ చదివిన పిల్లలు పెద్దపెద్ద ఉద్యోగాల్లో వున్నారు. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలోనే తన జీవితాన్ని అంకితం చేశారు. అటువంటి అనంత రామయ్య గారు రిటైరవుతున్నారంటే ఎంతో బాధగా వుంది. ఈ సందర్భంగా చంద్రునికో నూలుపోగులా చిన్న సన్మానం..."



ఫిజిక్స్ మాస్టారు ఉపన్యాసం ఏదీ వినిపించడం లేదు అనంత రామయ్యకు. సభలో కూర్చున్న పిన్నలు, పెద్దల చప్పట్లు ఆయనకు ఉత్తేజం కలిగించడం లేదు. నిన్నటి వరకు జరిగిన తన దినచర్య గుర్తుకొస్తూ వుంది.

స్కూలు ఉదయం ఎనిమిదిన్నరకు మొదలవుతుండగా ఆరుగంటల కల్లా లేచేవాడు. మొహం కడుక్కుని పేపర్ బాయ్ తెచ్చిన పేపరు చదువుతూ కూర్చునేవాడు. ఇంతలో భార్య టీ కప్పుతో వచ్చేది. టీ తాగి, పేపరు చదవడం పూర్తి చేసి పెరట్లోకి వెళ్ళేవాడు. అక్కడ కొబ్బరి, జామ, మందారం, నిత్యమల్లి, గులాబీ, కనకాంబరం మొక్కలు ఆయన్ని చూసి సంబర పడిపోతున్నట్టు తలలూపుతుంటే – బావిలో నీరు చకచకా తోడి వాటికి పోసేవాడు. ఇంట్లోకి వచ్చి షేవింగ్ చేసుకొని, గబగబా చన్నీళ్ళ స్నానం చేసేవాడు. స్నానం తర్వాత పూజ, ధ్యానం ముగిసే సరికి డైనింగ్ టేబుల్ దగ్గర టిఫిన్, పాలు రెడీగా వుండేవి. అక్కడ కొడుకు, కోడలు, కూతురు అందరూ తన కోసమే ఎదురు చూస్తూ వుండేవారు. అంతా కలిసే టిఫిన్ చేసేవారు. అది తర్వాత స్కూలుకు తీసుకువెళ్ళేందుకు రిక్షా ఎక్కగానే పది నిమిషాల్లో స్కూలు ముందు వుండేవాడు. అక్కడి నుంచి స్కూలు కార్యక్రమాల్లో మునిగిపోవడం, ఒంటి గంటకు కేరేజీ వచ్చేది. భోజనం తన కిష్టమైన కూరలతో, మూడున్నరకి ఇంటికొచ్చాక అగ్గగ్గ లాడుతూ నీళ్ళందించేవారు. పాలందించేవారు.

*18-6-99 * ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక




అంత ఆప్యాయత, అనురాగం, శ్రద్ధ తనపట్ల వుండేవి. ఇక రేపటి నుంచి విశ్రాంతే విశ్రాంతి. టన్నుల కొద్దీ విశ్రాంతి. అంత విశ్రాంతిని ఏం చేసుకుంటాడు తను? విశ్రాంతిగా రోజంతా గడపాలి..అది కాదు ప్రశ్న?...... ఆ ఇంట్లో తన విలువ పడిపోతుంది రేపటి నుంచి....అదే అదే బాధ!

తను ఉదయాన్నే లేవగానే టీ కప్పు అందించే భార్య ఇక అందించదు కాబోలు! పేపరు చదవడానికి కూర్చుంటే–

"మీకు రోజంతా తీరుబాటేగా! తర్వాత చదవొచ్చు లెద్దురూ..అబ్బాయి ఆఫీసుకు వెళ్ళి పోవాలి ముందు. అబ్బాయికివ్వండి" అని పేపరు తీసుకు పోతుంది కాబోలు.

'డాడీ మీరు రిటైరైపోయారు. ఇక ఇంటి విషయమంతా నేను చూసుకుంటాను. మీరు రెస్ట్ తీసుకోండి' అంటాడు కాబోలు కొడుకు.

'నాన్నా! రిటైరైపోయావు! కృష్ణా, రామా అని వుండక ప్రతిదీ నీకే కావాలంటావేమిటి?' అంటుంది కాబోలు కూతురు.

'మామగారూ! ఈ పూట మీకిష్టమైన గుత్తి వంకాయ కూర వండమంటారా?' అని అడిగే కోడలు అలా అడగడం మానేసి తన భర్త కిష్టమైన కూరలే వొండుతుందేమో! అయ్యో భగవంతుడా! ఈ రిటైర్‌మెంట్ ఒక డబ్బునే కాదు, ఆప్యాయతా, అనురాగం, గౌరవం, హోదా అన్నింటినీ హరింపజేస్తుందా? అనంత రామయ్య కళ్ళల్లో రెండు కన్నీటి చుక్కలు చేరుకున్నాయి. 'ఈ సన్మానాలు ఎందుకయ్యా నాకు? ఇంకా కొన్నాళ్ళు ఈ స్కూలు హెడ్ మాస్టర్‌గా బ్రతకనివ్వరాదా!' అని అరుద్దామని పించింది. ఏదో బలహీనత, చెప్పలేని అశాంతి గుండెల నిండా పొరలు పొరలుగా పేరుకు పోతోంది. ముందు వరసలోకి చూశాడు. భార్య, కొడుకు, కోడలు, కూతురు కూర్చుని ఇటే చూస్తున్నారు. వారి మొహాల్లో సంతోషం, గర్వం. తన పొగడ్తలు విని ఉబ్బితబ్బిబ్బై పోతు న్నట్టున్నారు. తనకు తెలుసు! ఇది ఎంతసేపో వుండదు. రేపటి నుంచి విదిలింపులు, బెదిరిం పులు..?

సన్మానం మొదలైంది. సన్నాయి వాద్యం మోత వినిపిస్తూ వుంది. బరువైన చామంతి పూల దండలు మెళ్ళో పడుతున్నాయి. గంధం పూశారు. బొట్టు పెట్టారు. శాలువా కప్పారు. పొగిడి, పొగిడి వదిలి పెట్టారు. 'ఇక నుంచి ఇంట్లో కూచో!' మెత్తని జోడుతో మోది చెప్పినట్టు మనసంతా బాధగా మారింది.

'ఇప్పుడు హెడ్ మాస్టర్ గారు మాట్లాడ తారు' అనగానే లేచి మైకు దగ్గరకు వచ్చాడు అనంతరామయ్య.

"నా లాంటి వాళ్ళకు ఈ రిటైర్‌మెంట్ ఒక శాపం. మీకు ఇంకా ఇంకా సేవ చేయాలని ఎంతో కోరికగా వుంది నాకు. కానీ ఏమీ లాభం లేదు. అందుకే మీ దగ్గరి నుంచి కన్నీటి వీడ్కోలు తీసుకుంటున్నాను. మీ అంద రికీ నా కృతజ్ఞతాభివందనాలు" అని చెప్పి కూర్చున్నాడు అనంతరామయ్య. అతని మన సంతా భారంగా, అశాంతిగా, దుఃఖంగా వుంది. ఏదో కోల్పోయినంత వెలితిగానూ వుంది.

సన్మానం అయిపోయింది. ఇంటికొచ్చేశారు.

"అదేమిటి నాన్నగారూ! అలా మాట్లాడారు?" అతని కొడుకు కళ్యాణ్ అడిగాడు.

"నా మనసులో ఏముందో అదే చెప్పాను".

"అదేం బాగాలేదు నాన్నగారూ! మీ మనసులో దుఃఖం అందరికీ ఎందుకు తెలియాలి?"

"ఏమో తెలియదు",

"రిటైర్ అయినంత మాత్రాన అంత బాధ పడ వలసిన అవసరమెందుకు?" కొడుకు సూటిగా ప్రశ్నిస్తే అనంతరామయ్య తత్తరపడ్డాడు.

ఆ రాత్రి అనంతరామయ్యకు కునుకు పట్ట లేదు. రేపటి నుంచి దినచర్య మారిపోతుంది. విశ్రాంతి..అంతా విశ్రాంతే. విలువలు పడ గొట్టే విశ్రాంతి. హఠాత్తుగా అనంతరామయ్యకి తన మిత్రుడు జగపతిరావు గుర్తుకొచ్చాడు. క్రిందటి ఏడాది రైల్వేలో ఉద్యోగం చేసి రిటైర్ అయిన జగపతిరావు ఇంటికి ఒకరోజు తను వెళ్ళాడు.

ముందు హాల్లో తామిద్దరూ కూర్చుని వుంటే అతని కొడుకు వచ్చి అన్నాడు–

"డాడీ! మా ఫ్రెండ్ వచ్చాడు. మేమిద్దరం ఇక్కడ కూర్చుంటాం. మీరు వరండాలోకి వెళ్ళి కూర్చోండి".

తామిద్దరూ వరండాలోకి వెళ్ళి కూర్చున్నారు. వరండా లోంచే కోడలిని కేకేశాడు జగపతి రావు.

'అమ్మాయ్! నా ఫ్రెండ్ అనంతరామయ్య వచ్చాడు. టీ తీసుకురామ్మా" అన్నాక, అర గంట గడిచింది. కోడలు పత్తా లేదు. కానీ లోపల హాల్లోంచి కోడలు గొంతు సుతారంగా విన్పించింది.

"టీ, టిఫిన్ తీసుకోండి" అంటూ. కొడుకు అతని ఫ్రెండ్ తింటున్నట్టుగా శబ్దాలు విన్పిస్తు న్నాయి.

జగపతిరావుతో పాటు అనంతరామయ్య కూడా టీ కోసం మరో అరగంట ఎదురు చూశారు.

జగపతిరావు వదనం బాధగా మారింది. వెల వెలబోతూ అనంతరామయ్యతో ఇలా అన్నాడు–

"చూశావా అనంతం! నేను రిటైరయ్యాను కదూ! అందుకే నా మాటంటే ఎవరికీ లెక్క లేదు. నేను రిటైరవ్వక ముందు నువ్వు మా ఇంటికి వచ్చేవాడివి. అప్పుడు ఎలా వుండేది నా జీవితం? నేను అడగకపోయినా నా కోసం వచ్చేవాళ్ళకు కాఫీలూ, టిఫిన్లూ సరఫరా చేసేవారు. అడుగులకు మడుగులు వత్తేవాళ్ళు. డబ్బు సంపాదిస్తూ వుంటేనే విలువ. హోదా వుంటేనే గుర్తింపు. లేకపోతే సంతలో చింతపండులాగా తీసిపారేస్తారు".

జగపతి రావు కళ్ళల్లో ఒక కన్నీటి చుక్క రాలి

అతని గుండెలపై పడింది. అతని బాధ చూస్తే గుండె కలుక్కుమంది అనంతరామయ్యకు.

'రేప్పొద్దున నా గతీ ఇంతేనా? నా వాళ్ళ దృష్టిలో పిపీలకం అయిపోతానా? ఛీ! వెధవ ఆలోచనలు' అని అవ్వడు తరిమి కొట్టాడు.

ఒకసారి జగపతిరావు కనిపించి చెప్పాడు తనో కోచింగ్ సెంటర్లో ఇంగ్లిష్ మాస్టరుగా ఉద్యోగం సంపాదించానని, ఇవ్వడు ఇంట్లో పరిస్థితి బాగుందని. తనకు విలువ ఇస్తున్నారనీను.

జీవితం ఎంత విచిత్రమైందో? డబ్బుతోనే దానికి ముడి. అతని భార్య హాయిగా గుర్రు పెడుతూ నిద్రపోతోంది. ఇన్నాళ్ళూ కాపురం చేసిన ఈవిడ దృష్టిలో కూడా దిగజారి పోతాడు కాబోలు! అందుకే జగపతిరావు లాగా ఏదో చిన్నదో, చితకదో ఉద్యోగం వెతుక్కోవాలి. 'లేకపోతే దినదిన గండం నూరేళ్ళాయుష్షు' లాగా అవుతుంది తన పరిస్థితి.

ఇలా ఆలోచిస్తూ వుండగానే మాగన్నుగా నిద్ర పట్టింది. తెల్లారి ఎప్పటిలాగే తెలివి వచ్చింది అనంతరామయ్యకు.

లేచి గది తలుపు తీస్తుంటే–

"అప్పడే ఏం కొంప మునిగిందని లేచారు? కాసేపు పడుకుంటే ఏం పోయిందిట?" వెనుక నుంచి భార్య గొంతు వినిపించింది. సమాధానం చెప్పాలనిపించలేదు. తిన్నగా పెరట్లోకి నడిచాడు. మొక్కలకు నీళ్ళు పోసి, పళ్ళు తోముకుని, హాల్లోకి వచ్చి పేపరు చదువుదాం అనుకోబోయేంతలో కళ్యాణ్ గది లోంచి వచ్చాడు.

"అబ్బాయి పేపరు తీసుకువెళ్ళు" అన్నాడు.

కళ్యాణ్ ఆశ్చర్యంగా తండ్రివైపు చూశాడు.

"ముందు మీరు చదవండి" అన్నాడు.

"రిటైరైనవాణ్ణి, ఠికాణా లేనివాణ్ణి! నాకెందుకు! నేనెప్పుడైనా చదువుతాను. నువ్వు తీసుకుపో" అన్నాడు.


"మీరే చదవండి" అని చెప్పి తండ్రి గురించి ఆలోచిస్తూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఒక వేలపోతే ఈ మర్యాదలన్నీ ఎగిరిపోతాయి కాబోలు! పేపరు చేతిలోకి తీసుకోగానే కోడలు వచ్చింది–

"మామగారూ! ఏం కూర చేయమంటారండీ?" అంది.

చిరాగ్గా మొహం పెట్టాడు అనంతరామయ్య.

"రిటైరైపోయిన మనిషిని! నన్నెందుకు అడుగుతావు? అబ్బాయిని అడిగి వాడి ఇష్టమొచ్చినట్టుగా చేయి!" అన్నాడు.



కోడలు విచిత్రంగా చూసింది. ఆ మాటలన్నీ కళ్యాణ్ వింటూనే వున్నాడు.

"అదేమిటి మామగారూ అలా అంటారు?" అని కోడలంటే–

"అంతా నా తలరాత" అంటూ అక్కడి నుంచి ధుమధుమలాడుతూ వెళ్ళిపోయాడు.

నెలరోజులు భారంగా గడిచాయి. ఈ నెల రోజులూ తండ్రి అందరి మీదా చిరాకు పడడం, కోపగించుకోవడం, గంటలు గంటలు విచారంగా కూర్చోవడం కళ్యాణ్‌లో ఆలోచన రేకెత్తించింది.

"ఎందుకు నాన్నగారూ అదోలా వున్నారు?" అని అడిగితే–

"నేనెలా వుంటే నీకెందుకు? ఇంటికి ఇప్పడు యజమాని నువ్వే. అందుకు నీ గురించి నువ్వే ఆలోచించుకో" అంటూ [illegible] సమాధానమిచ్చాడు.

తండ్రి అంతరంగం కొద్దికొద్దిగా అర్థమవుతూ వుంది కళ్యాణ్‌కు.

ఆ రోజు రాత్రి డైనింగ్ టేబుల్ దగ్గర అందరూ భోజనానికి కూర్చున్నారు. తింటున్న వాడల్లా తలెత్తి అందరి వైపూ చూశాడు అనంతరామయ్య.

"రేపటి నుంచి నేను ఉద్యోగానికి వెళ్ళాలి" అన్నాడు.

అందరూ ఆశ్చర్యంగా ఆయన వైపు చూశారు.

"ఏం ఉద్యోగమండీ" అడిగింది భార్య.

"ఒక కోచింగ్ సెంటర్లో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది నాకు".

"ఎందుకు నాన్నగారూ ఇప్పడీ హైరానా?" అంది కూతురు.

"నా విలువ పడిపోకుండా" ఠపీమని సమాధానం చెప్పాడు .

తండ్రిని ఒకసారి పరిశీలనగా చూసి గంభీరంగా అన్నాడు కళ్యాణ్.

"మీరు డబ్బు సంపాదిస్తేనే ఇంట్లో మీకు విలువ వుంటుందనుకుంటున్నారా? ఇన్నాళ్ళూ మీరు మమ్మల్ని అర్థం చేసుకున్నది ఇంతేనా? చాలా తప్పగా అనుకుంటున్నారు. అన్నం వుడికిందో లేదో తెలియాలంటే అన్నం అంతా పట్టి చూడాలా? నేనెలాంటి వాడినో మీకు తెలీదా? నేనెలాంటి వాడినో , అమ్మా, చెల్లీ, మీ కోడలూ ఎలాంటి వాళ్ళో మీకు తెలీదా? ఎందుకు నాన్నగారూ మమ్మల్ని ఇలా అవమానిస్తారు? ఎందుకు మిమ్మల్ని మీరు ఆత్మవంచన చేసుకుంటారు? మేమంతా మిమ్మల్ని ఎంతగా గౌరవిస్తామో మీకు తెలుసు. మీరు [illegible] మారిపోతామా? మీ విలువ, స్థానం దిగజారిపోతుందనుకున్నారా?

కొంతమంది ఇళ్ళల్లో రిటైరైన తండ్రుల అనుభవాలు మీ దృష్టికొచ్చి వుండొచ్చు. మమ్మల్ని కూడా అలాగే వూహించుకున్నారు. ఈ ఇంట్లో అలా ఎప్పటికీ జరగదు. మీరంటే మాకున్న ఆదరణ, అనురాగం, గౌరవం, శ్రద్ధ ఎప్పటికీ చెక్కు చెదరవని మీకు హామీ ఇస్తున్నాను. కోచింగ్ సెంటర్లో లెక్చరర్‌గా ఉద్యోగం చేసినా, చేయకపోయినా మీ స్థానం మీదే! ఈ ఇంటికి మీరే యజమాని. మేమంతా మీ వాళ్ళమే నాన్నగారూ!" అన్నాడు.

అందరూ అతని వైపు అవునన్నట్టుగా చూశారు. మనసుకు పట్టిన మబ్బు ఒక్కసారిగా తొలగినట్టయింది. అందర్నీ చూస్తూ అనంతరామయ్య నిండుగా నవ్వాడు.